క్లుప్తంగా

ఏం ఒరుగబెట్టారని విజయోత్సవాలు

కరీంనగర్: రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు విజయోత్సవాలు ఎలా జరుపుకుంటుందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు పంటలకు రైతు భరోసా ఎగ్గొట్టినందుకా? సాగుకు యోగ్యమైన ప్రతీ ఎకరాకు పెట్టుబడి సాయం అందిస్తానని ఎగ్గొట్టినందుకా? కౌలు రైతులకు ఏటా రూ.15 వేలు ఎగ్గొట్టినందుకు విజయోత్సవాలు జరుపుతున్నారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో 600 మంది రైతులు చనిపోయారని అన్నారు. రైతుల పక్షాన పోరాటం చేస్తున్న ప్రతిపక్ష పార్టీ నేతలపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ రైతాంగానికి భరోసా కల్పించిన మహానేత కేసీఆర్ అంటూ కొనియాడారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అభివృద్ధి మరిచిపోయి విమర్శలకే తావిస్తున్నారని, కేంద్ర మంత్రిగా చేసిందేమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ గ్రంథాలయ కమిటీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు నవీన్‌రావు, మధుసూధన్, మధు, రాంచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, పలకలు అందజేత

గంగాధర: స్వామి వివేకానంద విద్యాపరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పత్తిపాక నవీన్ అందజేసిన నోట్ పుస్తకాలతోపాటు దాతలు అందించిన పలకలను మంగళవారం మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు అందజేశారు. రైటింగ్ స్కిల్ పుస్తకాలు సైతం అందించారు. మాజీ సర్పంచ్ ఆకుల శంకరయ్య, హెచ్‌ఎంలు అంజిరెడ్డి, రాజేశం, అంగన్‌వాడీ టీచర్లు ఆదిపల్లి రమ, కోల కవిత, ఆయాలు శైలజ, మధ్యాహ్న భోజన నిర్వాహకులు మంజుల తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

రామడుగు: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థుల కోసం 1995–96 పదోతరగతి పూర్వ విద్యార్థులు రూ.25వేలు వెచ్చించి వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం పాఠశాల పూర్వ ఉపాధ్యాయుడు భోగ మునీందర్ ప్రారంభించారు.

విద్యార్థులకు అవగాహన

జమ్మికుంట: పట్టణంలో వావిలాల పీహెచ్‌సీ పరిధి కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం వైద్యుల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, పాఠశాలల్లో విద్యార్థులకు అతిసార వ్యాధి నిరోధక అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. డా.చందన, డా.ఫర్హానుద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీ హేమలత, ఉపాధాయులు తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: వెంకటేశ్వర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఓఆర్‌ఎస్ ద్రావణం వాడకం, చేతుల శుభ్రతపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. హెచ్‌ఎం కోటేశ్వర్‌రావు, ఉపాధ్యాయురాలు రజిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమించాలి



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

జమ్మికుంట: పట్టణ, గ్రామాల్లో ప్రజా సమస్యలపై నిర్దిష్టమైన ప్రత్యేక కార్యాచరణతో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. మండల కార్యదర్శి శీలం అశోక్, జక్కుల రమేశ్‌యాదవ్, కమిటీ సభ్యులు సదానందం, వడ్లూరి కిషోర్, దండిగారి సతీశ్, చల్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను విమర్శించడం తగదు

జమ్మికుంట: కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను విమర్శిస్తే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి పుట్టగతులుండవని బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ అన్నారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాయకులు సంపత్‌రావు, ఈశ్వర్, రవి పాల్గొన్నారు.

జెండా గద్దెకు భూమిపూజ

జమ్మికుంట రూరల్: వావిలాల, వెంకటేశ్వరపల్లి, పాపక్కపల్లి గ్రామాల్లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జెండా గద్దె నిర్మాణానికి జమ్మికుంట మార్కెట్ చైర్‌పర్సన్ పూల్లూరి స్వప్నసదానందం మంగళవారం భూమిపూజ చేశారు. మంద రాజు, శేఖర్, అనిల్ పాల్గొన్నారు.

ఉప కాలువలో ఆటో బోల్తా

శంకరపట్నం: మొలంగూర్ శివారులో మంగళవారం సాయంత్రం ఉప కాలువలో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. మొలంగూర్ గ్రామానికి చెందిన ఓ రైతు ఆటోలో కూలీలను వరినాట్లు వేసేందుకు ఉదయం తీసుకెళ్లాడు. వరినాట్లు వేసిన కూలీలను సాయంత్రం ఇంటికి తీసుకొచ్చేందుకు ఆటో వెళ్లగా.. అదుపు తప్పి కాలువలో బోల్తా పడింది. ఆటోలో కూలీలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

9 దాటితే కమలాపూర్ పోలేం..

- రాత్రి పదైతే జమ్మికుంట నుంచి రాలేం..
- బస్సుల్లో పెరిగిన ప్రయాణికుల రద్దీ
- విద్యాసంస్థల పునః ప్రారంభంతో మరింత రష్



హుజూరాబాద్ బస్టాండులో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

హుజూరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవచ్చని ఆర్టీసీ సంస్థ పేర్కొంటుండగా.. ప్రయాణికుల రద్దీకి తగ్గటుగా ఆర్టీసీ సంస్థ బస్సు సర్వీసులను ఏర్పాటు చేయకపోతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. హుజూరాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆయా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ఆర్డినరీ బస్సులు సరిపడా లేకపోవడంతో ఆ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అరిగోస పడుతున్నారు. సమయం దాటితే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తే జేబులకు చిల్లు పెడుతోందని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

గగనం..

హుజూరాబాద్ టూ జమ్మికుంట ప్రయాణం

హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు వెళ్లే బస్సు సర్వీసులు కిటకిటలాడుతున్నాయి. హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు వెళ్లే రూట్లలో 7 స్టాపింగులున్నాయి. జమ్మికుంట పట్టణంలో రైల్వే స్టేషన్ ఉండగా, ఈ స్టేషన్ నుంచి ప్రతిరోజు 25వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. తమ సొంత ఊర్లకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు ఎక్కుతుండగా.. మరింత రష్ పెరుగుతోంది. దీనికి తోడు మహిళ ఫ్రీ బస్సు రాకతో ఆ సమస్య మరింత జఠిలమవుతోంది. ప్రతిరోజు 130కి పైగా హుజూరాబాద్ ఆర్టీసీ బస్సులు నడుపుతుండగా, రాత్రి 10 దాటితే బస్సు సర్వీసులు బందవుతుండడంతో అటునుంచి ప్రయాణికులు ఇటు రాక.. ఇటునుంచి ప్రయాణికులు అటు వెళ్లక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

హుస్నాబాద్, పరకాల మార్గంలో..

హుజూరాబాద్ బస్టాండ్ నుంచి హుస్నాబాద్, పరకాల రూట్లలో వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులు వెళ్తున్నారు. ఉదయం వేళ ఈ పరిస్థితి మరింత ఘోరంగా ఉంటోందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రయాణికుల రద్దీకి తగినట్లుగా సరిపడా బస్సులు లేక అవస్థల మధ్య ప్రయాణం సాగుతోంది. హుస్నాబాద్, పరకాల రూట్లలో నడిచే బస్సు సర్వీసులు రాత్రి 9 దాటితే లేకపోతుండటంతో ఆ రూట్లో ఉండే గ్రామాలకు వెళ్లేవారు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి.

విద్యాసంస్థల పునః ప్రారంభంతో..

విద్యాసంస్థలు పునః ప్రారంభమైన వేళ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో బస్సుల్లో మరింత రష్ పెరుగుతోంది. మహిళలకు ఫ్రీ బస్సు.. ఇటు విద్యార్థులతో పరిమితికి మించి ప్రయాణికులతో బస్సులు నడుస్తున్నాయని బస్సు డ్రైవర్లు పేర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళ విద్యార్థులకు సరిపడా బస్సులు నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గంట నిరీక్షణ



జమ్మికుంటకు వెళ్లాలంటే బస్టాండులో ప్రయాణికుల రద్దీని చూస్తే భయమేస్తోంది. గంటసేపు నిరీక్షించి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి. బస్టాండులో ప్రవేశం వద్దకు ప్రయాణికులు పరిగెడుతూ బస్సు ఎక్కుతున్నారు. ప్రయాణికులకు తగ్గినట్లుగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలి.

– సమ్మ కిషోర్, ప్రయాణికుడు

సీటు దొరకడం లేదు



బస్సు కోసం ఎదురుచూస్తున్న వేళ ప్రయాణికుల రద్దీని చూస్తుంటే గుండె గుబేలుమంటోంది. మా ఊరికి పోవాలంటే గంటసేపు బస్టాండులోనే కూర్చుంటున్న. బస్సు ఎక్కినా సీటు దొరకటం లేదు. మాలాంటి వృద్ధుల పరిస్థితిని చూసైనా బస్సు సర్వీసులను పెంచాలి.

– ఊసిళ్ల చిలకమ్మ, ప్రయాణికురాలు

రద్దీకి తగ్గట్లు బస్సు సర్వీసులు



ప్రయాణికుల రద్దీకి తగినట్లు ఆయా రూట్లలో బస్సులను నడుపుతున్నాం. డయల్ యువర్ డీఎం ద్వారా తెలియజేస్తున్న సమస్యలను బట్టి బస్సుల సర్వీసులను నడుపుతున్నాం. ప్రయాణికుల రద్దీని బట్టి ప్రత్యేక బస్సులను సైతం ఏర్పాటు చేస్తున్నాం.

– రవీంద్రనాథ్, డిపో మేనేజర్, హుజూరాబాద్

కాంగ్రెస్ సంబరాలు



చొప్పదండి: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు



గంగాధర: రైతు భరోసా సంబరాల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి: రాష్ట్ర ప్రభుత్వం 9 రోజుల్లో రూ.9వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేసిన సందర్భంగా పట్టణంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం సంబరాలు నిర్వహించారు. సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, కొత్తూరి మహేశ్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, కొట్టె అశోక్, ముద్దం తిరుపతిగౌడ్, గుర్రం రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకు అన్నివిధాలుగా అండగా నిలుస్తూ వారి సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మధురానగర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు, రైతులు నిర్వహించిన సంబరాల్లో పాల్గొన్నారు. నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రామడుగు: రామడుగు, వెదిర రైతు వేదికల వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జవ్వాజీ హరీశ్ ఆధ్వర్యంలో నాయకులు రైతు భరోసా సంబరాలు నిర్వహించారు. టీపీసీసీ ఎస్సీ డిపార్టుమెంట్ రాష్ట్ర కోకన్వీనర్ వెన్న రాజమల్లయ్య, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పిండి సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీఎం, మంత్రుల చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

మానకొండూర్: మానకొండూర్, చెంజర్ల, పచ్చునూర్ గ్రామాల్లోని రైతు వేదికల్లో సీఎం సందేశం టెలికాన్ఫరెన్స్ వీక్షించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు, ఉపాధ్యక్షుడు రామిడి తిరుమల్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: కేశవపట్నంలో సీఎం చిత్రపటానికి మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్ క్షీరాభిషేకం చేశారు. బస్వయ్య, తిరుపతి, రాజిరెడ్డి, కవ్వ పద్మ, చింతిరెడ్డి పద్మ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: రైతు కళ్లలో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. ఇంగిలే రామారావు, ఎక్కటి సంజీవరెడ్డి, గూడెపు ఓదెలు, పెద్ది శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: సుందరగిరి, ఇందుర్తి, చిగురుమామిడి రైతు వేదికల్లో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా విజయోత్సవ సభ వీడియో కాన్ఫరెన్స్‌ను అధికారులు, రైతులు వీక్షించారు.

మానకొండూర్: సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. నందగిరి రవీందర్, మర్రి ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: గన్నేరువరంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బహుమతి అందిస్తున్న ఎస్సై నరేశ్‌రెడ్డి

చొప్పదండి: డ్రగ్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా పట్టణంలోని గీతా విద్యాలయంలో పోలీసులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహనపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్సై నరేశ్‌రెడ్డి బహుమతులు అందించారు. అరవింద్, సృజన్‌కుమార్, దేవయ్య, లింగారావు తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్సై వంశీకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే బాలుర గురుకుల విద్యాలయంలో డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, స్లోగన్లపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

రామడుగు: రామడుగు మోడల్ స్కూల్‌లో మాదక ద్రవ్యాల నిర్మూలనపై నిర్వహించిన మండలస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వ్యాసరచన పోటీల్లో స్రవంతి ప్రథమ, చర్చ విభాగంలో సీహెచ్ ఆశ్విత, ఎం.శరణ్య ప్రథమ, నినాదాల విభాగంలో దీక్షిత ప్రథమ స్థానంలో నిలిచారు.

చిగురుమామిడి: చదువుకునే విద్యార్థులు విద్యపైనే దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ కోరారు. చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాలలో మాదక ద్రవ్యాల నివారణకు చర్యలు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చిగురుమామిడి ఎస్సై శ్రీనివాస్‌యాదవ్, ప్రిన్సిపాల్ హర్జిత్‌కౌర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గన్నేరువరం: గన్నేరువరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠశాలలో డ్రగ్స్‌పై పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల విద్యాధికారి రామయ్య, ఏఎస్సై లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయాలి



హుజూరాబాద్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ బాధ్యులు

హుజూరాబాద్: ప్రభుత్వ విద్యను విధ్వంసం చేసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 27న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ పల్కల ఈశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో పోస్టర్ ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు బండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, వేల్పుల రత్నం, శంకర్, అల్లి శ్రీనివాస్, మల్లేశం, వెంకట్రాజం పాల్గొన్నారు.

చిగురుమామిడి: ప్రభుత్వ విద్యావిధానాలకు వ్యతిరేకంగా ఈనెల 27న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి కోరారు. మంగళవారం సుందరగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. శంకర్, కరుణాకర్, మునిప్రసాద్, జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం చేయాలి


హుజూరాబాద్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ విధానాన్ని నిరసిస్తూ జూలై 9న నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మెను భవన నిర్మాణ కార్మికులు విజయవంతం చేయాలని జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కదిరే రమేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, జంబుకం వెంకన్న, పళ్ల తిరుపతి, రావుల ఎల్లయ్య, రేణుకుంట సారయ్య తదితరులున్నారు.

సమ్మెలో తాము పాల్గొననున్నట్లు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు సమ్మె నోటీస్ అందజేశారు.

ప్రజాకాంక్ష మేరకు బ్రిడ్జి నిర్మాణం

గన్నేరువరం: గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల ప్రజల ఆకాంక్షకనుగుణంగా మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అఖిలపక్షం నాయకులు, బ్రిడ్జి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గన్నేరువరంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. రాజకీయ అవసరాల కోసం బ్రిడ్జి నిర్మాణం చేపట్టొద్దని, అందరికీ సౌకర్యవంతంగా ఉండే ప్రదేశం నుంచి మానేరు వాగుపై కరీంనగర్‌కు బ్రిడ్జి నిర్మాణం చేపడితే ఆమోదయోగ్యంగా ఉంటుందన్నారు. మాజీ జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, నాయకులు పుల్లెల లక్ష్మణ్, తోట రామచందర్‌రావు, జక్కనపల్లి సత్తయ్య, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రామచంద్రంగౌడ్, బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్, బామండ్ల రవీందర్, లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవతోనే ప్రత్యేక గుర్తింపు



అవార్డులు సాధించిన విద్యార్థులతో రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి

కొత్తపల్లి: సేవతోనే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, సంస్కారంలో ఒక ప్రధాన భాగమే సేవా గుణం అని రచయిత, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బి.మధుసూదన్ రెడ్డి అన్నారు. కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం లియో క్లబ్ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యతో పాటు వినయం, చదువుతో సంస్కారం, ఉత్తమ వ్యక్తిత్వంతో సేవాగుణం అలవడుతుందన్నారు. అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కళాశాల లియో క్లబ్ సభ్యులు అనాథ ఆశ్రమాలకు వంట పాత్రల వితరణ, రక్తదాన శిబిరాలు, పేదలకు బ్లాంకెట్స్, పండ్లు పంపిణీ, వనమహోత్సవం వంటి సేవలు అందించారని తెలిపారు. పౌర సమాజ మన్ననలతోపాటు రాష్ట్రస్థాయి పురస్కారాలకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఉత్తమ లియో క్లబ్ అవార్డుతోపాటు రాష్ట్రస్థాయిలో అవార్డులు, ప్రశంసలు పొందినట్లు పేర్కొన్నారు.



రామడుగు: చిప్పకుర్తి గ్రామ బస్టాండ్ వద్ద ఉన్న నీటి ట్యాంకు కింద ఏర్పాటు చేసిన గేట్ వాల్వులకు తక్షణం పైకప్పులు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో రాజేశ్వరి ఆదేశాలు జారీ చేయడంతో.. మంగళవారం పైకప్పులను అమర్చారు. సాక్షిలో మంగళవారం వచ్చిన కథనానికి స్పందించిన ఎంపీడీవో సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయగా.. వెంటనే కూలీలతో వెళ్లిన అధికారులు పైకప్పులకు మూతలు వేశారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

చోరీ కేసులో ఇద్దరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

గంగాధర: వెంకటాయిపల్లిలో ఈనెల 8న దొంగతనానికి పాల్పడిన ఘటనలో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు.. మంగళవారం మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేయడంతోపాటు వారి నుంచి 4 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. గంగాధర పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఎస్సై వంశీకృష్ణ, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్సై నాగరాజుతో కలిసి వివరాలు వెల్లడించారు. వెంకటాయిపల్లి గ్రామానికి చెందిన ఉప్పుగండ్ల గంగారెడ్డి ఈనెల 8న ఇంటికి తాళం వేసి మంచినీళ్లకు వెళ్లి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బంగారం, వెండితోపాటు నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. ఇద్దరిని ఈనెల 13న అదుపులోకి తీసుకొని 20 తులాల బంగారం, మరో నిందితుడిని 16న అదుపులోకి తీసుకొని 3 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. చోరీలో భాగస్వాములైన గన్నేరువరం మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన ప్రశాంత్, మానకొండూర్‌కు చెందిన రాజశేఖర్‌ను అరెస్టు చేయడంతోపాటు వారి వద్ద నుంచి 4 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హుజూరాబాద్‌రూరల్: కందుగుల గ్రామ శివారులో రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడని టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. ఈనెల 20న రాత్రి సాయిరాం రైస్ మిల్లు దగ్గర్లో రోడ్డుపై మోటార్ సైకిల్‌తో రోడ్డుపై గాయాలతో పడి ఉన్నాడు. పరిసర ప్రాంతాల్లో ఉండే కార్మికులు చూసి 108లో చికిత్స నిమిత్తం హుజూరాబాద్ తరలించారు. అనంతరం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలియదని, ఎవరికైనా తెలిస్తే హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌కు సమాచారమందించాలని కోరారు.

గీత కార్మికుడు..

హుజూరాబాద్‌రూరల్: పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు బాలగోని రాములు(55) తాటిచెట్టు పైనుంచి కింద పడి తీవ్ర గాయాలు కాగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మే 24న రాములు గీత వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో మోకు కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

కమిటీల దగ్గర ఇందిరమ్మ ఇళ్లు కొనుగోలు



మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ కమిటీల దగ్గర పేదోళ్లు ఇళ్లు కొనుగోలు చేయాల్సి దుస్థితి ఏర్పడిందని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్‌లో ఆయన మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అనేక పథకాలు అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు హామీలు ఇస్తూ బాండ్ పేపర్ రాసిచ్చారని, మెనిఫెస్టోలో పెట్టారని తెలిపారు. నియోజకవర్గంలో 48 వేల మంది ఇల్లు కట్టుకునేందుకు అర్హులని అధికారులు గ్రామసభల్లో చదివడంతో అందరూ సంతోషపడ్డారన్నారు. తీరా సమయానికి 3,200 ఇస్తున్నామని, అవి కూడా అనుకూలంగా ఉన్నవారికి, పార్టీ నాయకులు, డబ్బులున్నవారికే ఇచ్చారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో మానకొండూర్‌లో ఈనెల 26 మహా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. మాజీ జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్, సిద్దం వేణు, దేవేందర్‌రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్, మల్లయ్య పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలని నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు, గ్రామస్తులు

ఇల్లందకుంట: చిన్నపాటి వర్షానికే మండల కేంద్రంలోని 3వ వార్డులో పాఠశాలకు వెళ్లే రోడ్డులో వర్షం నీరు నిలిచి విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం నిరసన చేపట్టారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే తేలికపాటి వర్షానికే దారి గుంతలు పడడంతో కురిసిన వర్షం నీరంతా అక్కడికి చేరి నిలిచిపోయింది. విద్యార్థులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదని సీపీఎం మండల కార్యదర్శి రాము, సీపీఐ మండల కార్యదర్శి రత్నాకర్ అధికారులపై మండిపడ్డారు.

ట్యాంక్ ఎక్కి నిరసన



ట్యాంకుపై పంచాయతీ కార్మికుడు

ఇల్లందకుంట: ఆన్‌లైన్‌లో తన పేరు నమోదు చేయాలంటూ పంచాయతీ కార్మికుడు నీటి ట్యాంక్ ఎక్కి హల్‌చల్ చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. శ్రీరాములపల్లి గ్రామ పంచాయతీలో పదేళ్లుగా దినసరి కార్మికుడిగా పని చేస్తున్న పర్లపల్లి మల్లేశ్ అనే వ్యక్తి తన పేరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలంటూ గ్రామంలో నీటి ట్యాంక్ ఎక్కి గంటసేపు నిరసన వ్యక్తం చేశాడు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా దిగి రాలేదు. చివరకు కిందికి దిగగా.. అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

ఎమ్మెల్సీని కలిసిన పద్మశాలీ నేతలు

జమ్మికుంట: పట్టణానికి చెందిన తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ చేనేత సమైక్య ఉపాధ్యక్షుడు సిలివేరు శ్రీకాంతనేత ఎమ్మెల్సీ విజయశాంతి నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు కృష్ణమోహన్, కుమార్ పాల్గొన్నారు.